క్లుప్తంగా

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మేయర్ రామయ్య, ఎమ్మెల్యే చరిత

కల్లూరు: కల్లూరు అర్బన్ పరిధిలోని కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు నగర మేయర్ బీవై రామయ్య, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. గురువారం 19వ వార్డులోని గౌతమీనగర్‌లో రూ. 24 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మేయర్, ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. వారు మాట్లాడుతూ.. నగరంలోని అన్ని వార్డులను అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో పెరుగు పురుషోత్తం రెడ్డి, ప్రభాకర్‌యాదవ్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

డిగ్రీ స్పెషల్ సప్లిమెంటరీకి 56 మంది గైర్హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ, బీఈడీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా గురువారం జరిగిన పరీక్షలకు 56 మంది గైర్హాజరయ్యారు. డిగ్రీ పరీక్షలు – 11, బీఈడీ పరీక్షలు – 8 కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు. డిగ్రీ పరీక్షలకు 321 మందికిగాను 275 మంది హాజరు కాగా 46 మంది గైర్హాజరయ్యారని, వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. బీఈడీ పరీక్షలకు 76 మందికి 66 మంది హాజరు కాగా 10 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు.

ల్యాబ్ సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల డయాగ్నోస్టిక్ సెంటర్‌లోని 24వ, 33వ నంబర్ ల్యాబ్‌లలో రోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈ ల్యాబ్‌లలో రక్త పరీక్షలకు వచ్చిన రోగులు.. ఎక్కడ శాంపిల్స్ సేకరిస్తారు, ఎక్కడ పరీక్షలు చేస్తారు, ఎక్కడ రిపోర్టులు ఇస్తారు వంటి విషయాలు తెలియక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సాయంత్రం 4 గంటలు దాటినా రిపోర్టులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ తర్వాత వైద్యులు ఓపీలో ఉండకపోవడంతో చికిత్స అందకుండానే రోగులు వెనుదిరగాల్సి వస్తోందని, సమస్యను పరిష్కరించాలని కోరారు.

నిరాశ్రయుల వసతి గృహం తనిఖీ



వసతి గృహంలోని వారితో మాట్లాడుతున్న న్యాయమూర్తి లీలావెంకట శేషాద్రి

కర్నూలు: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి గురువారం ఇందిరాగాంధీ నగర్‌లోని పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. కార్యాలయాలకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించి అక్కడి సౌకర్యాలు, పరిశుభ్రతను పరిశీలించారు. అక్కడి వారికి అందించే భోజన వసతి సదుపాయాలను గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదులు నిర్మల, శివసుదర్శనం, డాక్టర్ రాయపాటి శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

దారంతా గుంతలమయం!



గుంతలమయంగా మారిన కొల్లంపల్లితండా రోడ్డు

కల్లూరు: మండలంలోని ఉలిందకొండ నుంచి కొలంపల్లి తండా, యాపర్లపాడు గ్రామాలకు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారాయి. ఆయా రోడ్లుపై నిత్యం భారీ వాహనాలు అధిక లోడుతో తిరుగుతుండడం వల్ల రోడ్లపై గుంతలు ఏర్పడుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్లను బాగు చేయాలని కోరుతున్నారు.

ధీరవనిత సరోజినీనాయుడు

కర్నూలు (సిటీ): స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని మహిళలకు ఆర్థిక, రాజకీయ, విద్యాపరంగా సమాన హక్కులు ఉండాలని నొక్కి చెప్పిన ఆణిముత్యం సరోజినీనాయుడు అని క్లస్టర్ యూనివర్సిటీ వీసీ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్ పేర్కొన్నారు. గురువారం వర్సిటీలో సరోజినీ నాయుడు జయంతి, జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె చిత్రపటానికి వీసీ డీవీఆర్ సాయిగోపాల్, రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు, క్లస్టర్ యూనివర్సిటీ డీన్‌లు, అధ్యాపకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థులు సరోజినీ నాయుడును ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

కర్నూలు(హాస్పిటల్): మహిళల స్వేచ్ఛ కోసం, వారి సాధికారత కోసం పాటుపడిన ధీరవనిత సరోజిని నాయుడు అని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకరశర్మ చెప్పారు. జాతీయ మహిళా దినోత్సవం (సరోజినీనాయుడు జయంతి) సందర్భంగా గురువారం గాయత్రి ఎస్టేట్‌లోని తన క్లినిక్‌లో పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్య పోరాటంతో పాటు మహిళల స్వేచ్ఛ కోసం సరోజినీనాయుడు ఎంతో కృషి చేశారన్నారు. మహాత్మాగాంధీతో పాటు క్విట్ ఇండియా, దండి మార్చ్ తదితర ఉద్యమాల్లో పాల్గొన్నారని, ఎన్నోసార్లు జైలుకు వెళ్లారన్నారు.

కర్నూలు కల్చరల్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం నైటింగేల్ ఆఫ్ ఇండియా, భారత స్వాతంత్ర్య ఉద్యమ నాయకురాలు సరోజినీ నాయుడు జయంతి ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్, డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్క, ఉద్యోగులు, పాఠకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సరోజినీ నాయుడు రాజకీయవేత్తగా, కవయిత్రిగా, యునైటెడ్ ప్రావిన్స్‌కు మొదటి గవర్నర్‌గా పని చేశారని కొనియాడారు.



సరోజినీ నాయుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు



నివాళులర్పిస్తున్న వీసీ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్ తదితరులు



నివాళులర్పిస్తున్న డాక్టర్ శంకరశర్మ


మహిళా చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జిల్లా కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సి.సరళాదేవి

కర్నూలు సిటీ: క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీలో గురువారం జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సరోజిని నాయుడు జయంతి కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఇందిరాశాంతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కర్నూలు జిల్లా కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సి.సరళాదేవి హాజరై సరోజిని నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విలువలతో కూడిన విద్య, పాజిటివ్ దృక్కోణంతో కూడిన సమానత్వం నేడు అవసరమని అన్నారు. మహిళలకు కల్పించిన హక్కులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగిఉండాలన్నారు. గృహ హింస చట్టం, కుటుంబంలో స్త్రీల పాత్ర సాంకేతిక మాధ్యమ వినియోగం తదితర అంశాలపై విద్యార్థులను చైతన్య పరిచారు. వైస్ ప్రిన్సిపాల్ జే.హేమంత్, ఎ.సత్యనారాయణ, ఐక్యూసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఫక్రున్నీసా బేగం తదితరులు పాల్గొన్నారు.

నేడు దామోదరం జయంతి



దామోదరం సంజీవయ్య

కర్నూలు(అర్బన్): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రి, దివంగత దామోదరం సంజీవయ్య 104వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ డీడీ కే తులసీదేవి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ పీ రంజిత్ బాషా ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, దళిత సంఘాల నాయకులతో కలిసి ఉదయం 9 గంటలకు కలెక్టరేట్ నుంచి సీ క్యాంప్ సెంటర్ మీదుగా నంద్యాల చెక్‌పోస్టు మూడు రోడ్ల కూడలిలో ఉన్న సంజీవయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించడం జరుగుతుందన్నారు. అనంతరం అక్కడే జయంతి సభను కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి జిల్లాలోని ప్రజలు, దళిత, ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని డీడీ కోరారు.

మధ్యవర్తులకు ఆహ్వానం

కర్నూలు: జిల్లా కేంద్రంలోని మీడియేషన్ కేంద్రంలో మధ్యవర్తులుగా వ్యవహరించేందుకు సుముఖంగా ఉన్నవారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాలు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి సూచనల మేరకు 40 గంటల శిక్షణా కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గురువారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన సామాజిక కార్యకర్తలు, నిపుణులు/నిష్ణాతులు, వారు పనిచేసిన రంగాలలో కనీసం 15 సంవత్సరాల అనుభవం లేదా ఉన్నత స్థానాల్లో పని చేసి పదవీ విరమణ చేసిన సీనియర్ ఎగ్జిక్యూటివ్స్ కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూరించిన దరఖాస్తులను ఈనెల 17వ తేదీలోగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, న్యాయ సేవా సదన్, కర్నూలు అనే చిరునామాకు పంపాలన్నారు.

కళాశాలను తరలించాలి

కర్నూలు (సిటీ): ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండ్‌కు సమీపంలో ఉన్న ఏపీ ఉర్దూ రెసిడెన్షియల్ జూనియర్ బాయ్స్ కాలేజీని మరోచోటికి తరలించాలని విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆ కాలేజీ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మహేంద్రనాయుడు, ఆర్ఎస్ఎఫ్), ఆర్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్, ఎస్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షులు శివప్రసాద్‌గౌడ్ మాట్లాడుతూ.. కొత్తబస్టాండ్‌లోని త్రిగుణ రెస్టారెంట్ ముందు నూతనంగా జూనియర్ కాలేజ్ షిఫ్ట్ చేయడం జరిగిందని, అక్కడ మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలేజీ పక్కన వైన్‌షాప్ ఉండటం వల్ల మందుబాబులు బిల్డింగ్‌పైకి మద్యం సీసాలు విసురుతూ విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. కాలేజీ చుట్టుపక్కల పందుల స్వైరవిహారం, దోమల బెడద, దుర్వాసన, బస్సుల ధ్వనులు వంటి సమస్యలు ఉన్నాయని, తక్షణమే కళాశాలను మరోచోటికి తరలించాలని డిమాండ్ చేశారు. విద్యార్థి జేఏసీ నాయకులు బాలు, మధు, అభి, శివ, అంజి తదితరులు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పని చేస్తే అధిక కూలి



నందనపల్లెలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ వెంకట రమణయ్య

కర్నూలు(రూరల్): ఉపాధి హామీ పథకం కూలీలు నిర్ణయించిన కొలతల ప్రకారం పనులు చేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకట రమణయ్య అన్నారు. గురువారం నందనపల్లె గ్రామ పరిధిలో జరుగుతున్న పనులను పీడీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కూలీల హాజరు, మస్టర్లను పరిశీలించారు. కొలతల ప్రకారం పనులు చేస్తే రోజువారి వేతనం రూ.300 వరకు వస్తుందని తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి 12 గంటల వరకు పనిచేయాల్సి ఉంటుందన్నారు. ప్రతి కూలీ కనీసం 6 గంటలు పనిచేయాలని కేంద్ర ప్రభుత్వం గైడ్‌లైన్స్ జారీ చేసిందని తెలిపారు. పనుల్లో నాణ్యత ప్రమాణలు పాటించాలని సూచించారు. ఒకరి బదులు మరొకరు పనులకు రాకూడాదన్నారు. ఎవరి పేరు ఉంటే వారే పనుల్లో ఉండాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో పనులు అవసరమైన కూలీలు ముందుకొస్తే వెంటనే వారికి ఉపాధి పనులు కల్పిస్తామని తెలిపారు. కూలీల హాజరు శాతం మరింత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ రఘునాథ్, ఏపీఓ మధుబాబు, మనోహర్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ ఉన్నారు.

వీధి కుక్కల బెడద

కర్నూలు(అర్బన్): నగరంలోని బీ క్యాంప్ చివరన ఉన్న ఎస్సీ, బీసీ కళాశాల బాలికల వసతి గృహాల ప్రాంగణంలో వీధి కుక్కల బెడద అధికమైంది. ఈ ప్రాంగణంలో ఉన్న మూడు కళాశాలల బాలికల వసతి గృహాల్లో దాదాపు వెయ్యి మంది విద్యార్థిను లు వసతి పొందుతూ చదువుకుంటున్నారు. ఆయా వసతి గృహాలకు ప్రహరీలు ఉన్నా, వీధి కుక్కలు గోడలు దూకి హాస్టళ్ల ప్రాంగణంలో సంచరించడంతో పాటు హాస్టళ్లలోకి వచ్చే విద్యార్థినులపై దాడి చేస్తున్నాయి. దీంతో ఆయా వసతి గృహాల్లోని విద్యార్థినులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి సమయాల్లో గదుల వరండాల్లో కూడా సంచిస్తుండడం వల్ల విద్యార్థినులు బయటకు వచ్చేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి వీధి కుక్కల బెడద నుంచి రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు


–కలెక్టర్ రంజిత్ బాషా



జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను సన్మానించిన కలెక్టర్, జేసీ

కల్లూరు: చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కలెక్టర్ రంజిత్ బాషా అన్నారు. చిన్నటేకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఐఐటీ మెడికల్ అకాడమీకి చెందిన విద్యార్థులు జేఈఈ మెయిన్స్ మొదటి విడత ఫలితాల్లో మంచి ప్రతిభ చాటారు. టాప్ పర్సంటైల్ సాధించిన విద్యార్థులను కర్నూలు కలెక్టర్ రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ నవ్య సన్మానించారు. హాజరైన 60 మంది విద్యార్థులు కూడా మంచి పర్సంటైల్ సాధించినట్లు అకాడమీ డైరెక్టర్ జిల్లా ఉన్నతాధికారులకు వివరించారు. కార్యక్రమంలో డీసీఓ డాక్టర్ శ్రీదేవి, అకాడమీ డైరెక్టర్ ఉమామహేశ్వరప్ప, రిటైర్డ్ పీడీ చంద్రశేఖర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మురుగు కాల్వలు నిర్మించండి



మున్సిపల్ మేనేజర్ చిన్నరాముడుకు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు (టౌన్): నగరంలోని 29వ వార్డు వెంకటేశ్వర నగర్‌లో మురుగు కాల్వల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక నగరపాలక కార్యాలయంలో మేనేజర్ చిన్న రాముడును కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంజనేయ స్వామి గుడికి వెళ్లే రహదారిలో మురుగు కాల్వలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. దీనిపై గతంలోనూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని చెప్పారు. సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సీపీఐ నాయకులు సులోచనమ్మ, పద్మ, జయలక్ష్మి, రాజు, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

రక్తహీనతతో ఆరోగ్య సమస్యలు



మాట్లాడుతున్న డాక్టర్ విజయానందబాబు

కర్నూలు(హాస్పిటల్): రక్తహీనత వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పీడియాట్రిక్స్ కర్నూలు అధ్యక్షుడు డాక్టర్ విజయానందబాబు చెప్పారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పీడియాట్రిక్స్ (ఐఏపీ) ఆధ్వర్యంలో గురువారం స్థానిక బి.క్యాంపులోని ట్రైబల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో విద్యార్థులకు రక్తపరీక్షలు నిర్వహించి, రక్తహీనత వల్ల కలిగే అనర్థాల గురించి వైద్యులు వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయానందబాబు మాట్లాడుతూ.. ఐఏపీ ఆధ్వర్యంలో కర్నూ లు మెడికల్ కాలేజీ, విశ్వభారతి మెడికల్ కాలేజీ, మిడుతూరు సీహెచ్‌సీ, గుడిపాడు ప్రభుత్వ పాఠశాల, సరోజినిదేవి బాలికల పాఠశాలల్లో అవగాహ న కార్యక్రమాలు నిర్వహించామన్నారు. రక్తహీనత వల్ల దుష్ఫలితాలను వివరించి, పోషకాహారంతో దానిని ఎలా అధిగమించాలో వివరించినట్లు తెలిపారు. సెక్రటరీ డాక్టర్ వీరరత్నాకర్‌రెడ్డి, ట్రెజరర్ డాక్ట ర్ ప్రకాష్ఆనంద్, డాక్టర్ కాశీభారతి, డాక్టర్ రాజా మధుసూదన్, మిడుతూరు సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీడీ సర్వే పూర్తి చేయాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో ఎన్‌సీడీ సర్వే త్వరగా పూర్తి చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ ఆదేశించారు. ఆమె గురువారం కర్నూలులోని రోజా యూపీహెచ్‌సీ పరిధిలో ఉన్న 123, 124వ సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్న ఎన్‌సీడీ 3.0 సర్వేను తనిఖీ చేశారు. మాట్లాడుతూ.. ఈ సర్వేలో రొమ్ము, నోటి క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌తో పాటు బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ పరీక్షలు చేస్తారన్నారు. అనుమానిత కేసులను పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలకు పంపిస్తారని, మెరుగైన వైద్యం అవసరమైన వారిని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు రెఫర్ చేస్తారని తెలిపారు. డీఐఓ డాక్టర్ నాగప్రసాద్‌బాబు, డీపీఎంఓ డాక్టర్ ఉమ, డెమో శ్రీనివాసులు, వైద్యాధికారులు ఫాతిమా, నందిని, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఎపిడమాలజిస్టు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బడీరాత్ ప్రార్థనలు



రంజాన్ మాసానికి ముందు వచ్చే షాబాన్ నెల 15వ రోజు ముస్లింలు శుభప్రదంగా జరుపుకునే షబ్ ఏ బరాత్ (పెద్దరాత్రి)ను పట్టణంలోని ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. గురువారం రాత్రి రెవెన్యూ కాలనీలోని మునువర మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

కార్యకర్తలకు అండగా ఉంటా



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డిని సత్కరిస్తున్న పార్టీ మహిళా విభాగం నగర నాయకురాళ్లు

కర్నూలు (టౌన్): కార్యకర్తలకు 24 గంటలూ అండగా ఉంటా.. పార్టీ కోసం సైనికుల్లా పనిచేద్దామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలిగా నియమితులైన మంగమ్మ, అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలిగా నియమితులైన రాధికమ్మ, పార్టీ మహిళా విభాగం నాయకురాళ్లు గురువాకం గురువారం స్థానిక గిప్సన్ కాలనీలోని ఎస్వీ స్వగృహంలో ఆయనకు శాలువా కప్పి గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్వీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళలను అన్ని రంగాల్లో ఆదుకున్న పార్టీ ఏదైనా ఉందంటే అది జగనన్న సారథ్యంలోని వైఎస్సార్‌సీపీ మాత్రమే అన్నారు. మహిళలకు ఆర్థికంగా చేదోడుగా నిలిచి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారని కొనియాడారు. సంక్షేమ పథకాలకే పరిమితం చేయకుండా రాజకీయ పదవుల్లో 60 శాతం మహిళలకు కేటాయించి చట్టసభల్లో, కార్పొరేషన్ పదవుల్లో మహిళలకు ఆగ్రస్థానం కల్పించారన్నారు. జగనన్న కంటే ఎక్కువ పథకాలు ఇస్తామని చెప్పి కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. దాదాపు 9 నెలల పాలనలో ఒక్క పథకం కూడా అమలు చేయలేదన్నారు. నగర అధ్యక్షురాలు, అంగన్‌వాడీ విభాగం అధ్యక్షులు మాట్లాడుతూ.. కర్నూలు నగరంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కూటమి పాలన మహిళలు తీవ్ర అంసతృప్తితో ఉన్నారన్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, అనుబంధ విభాగాల నియోజకవర్గ అధ్యక్షులు, నాయకులు, మహిళా కార్యకర్తలు, ఎస్వీ యూత్ సభ్యుడు పాల్గొన్నారు.

హాకీ పోటీల్లో సత్తా చాటాలి

కర్నూలు (అగ్రికల్చర్): కాకినాడలో ఈనెల 15 నుంచి 28వ తేదీ వరకు జరగనున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ పోటీలకు జిల్లా నుంచి ఇద్దరు యనిమల్ హస్బెండరీ అసిస్టెంట్లు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ నిర్వహించిన ఎంపిక పోటీల్లో వెల్దుర్తి మండలం నర్సాపురం ఏహెచ్ఏ రసూల్‌ఖాన్, కల్లూరు మండలం కొంగనపాడు ఏహెచ్ఏ మహేష్ అత్యుత్తమ ప్రతిభ కనపరచి ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ పోటీలకు అర్హత సాధించారు. ఈ నేపథ్యంలో ప్రతిభ కనబరచిన ఏహెచ్ఏలను జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జి.శ్రీనివాస్, కల్లూరు ఏరియా వెటర్నరీ హాస్పిటల్ ఏడీ పార్థసారథి, పుల్లగుమ్మి వెటర్నరీ డాక్టర్ స్వాతి అభినందించారు. జాతీయ పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న పశుసంవర్ధక శాఖ జేడీ శ్రీనివాస్ తదితరులు

కర్నూలు (టౌన్): జాతీయ స్థాయి సివిల్ సర్వీసెస్ హాకీ పోటీలకు ఎంపికైన కొంగనపాడు సచివాలయ అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్ మహేష్‌ను గురువారం డీఎస్‌డీఓ భూపతి రావు, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ జి.శ్రీధర్ రెడ్డి ఘనంగా సత్కరించారు.

చౌడేశ్వరీ దేవికి పట్టువస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలు అందజేస్తున్న కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, సతీష్

కోడుమూ రూరల్: కోడుమూరులో వెలసిన చౌడేశ్వరీదేవి తిరునాలను పురస్కరించుకుని కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సతీష్ గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా లింగమయ్య ఇంటి నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో కోడుమూరు జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు క్రిష్ణారెడ్డి, క్రిష్ణాపురం సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, కోడుమూరు ఉపసర్పంచ్ మాదులు, మాజీ ఉపసర్పంచ్ ప్రవీణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రమేష్‌నాయుడు, నాయకులు రవికుమార్‌రెడ్డి, మల్లారెడ్డి, శివరాముడు, లింగన్న, రాఘవేంద్ర, లింగమూర్తి, హనుమంతు, విష్ణుదాస్, జగదీష్, మాసుమ్, బోరెల్లి సోమన్న తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన



మాట్లాడుతున్న ఎంవీఐ రవీంద్రకుమార్

కర్నూలు (టౌన్): వాహనాదారులు రహదారి భద్రతా నియమాలపై అవగాహన కలిగి ఉండాలని రవాణా శాఖ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) కె.రవీంద్రకుమార్ సూచించారు. నగర శివారులోని బి.తాండ్రపాడులోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో గురువారం 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ.. జనవరి 16 నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు నిర్వహించే రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా డ్రైవర్లు, వాహనదారులకు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంపూర్ణ అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇన్సూరెన్స్ కంపెనీల మేనేజర్లు మాట్లాడుతూ.. వాహనదారులు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. ప్రమాదం జరిగినప్పుడు వాహనంలోని వ్యక్తి చనిపోయినా, గాయపడినా పరిహారం లభిస్తుందన్నారు. రవాణా శాఖ ఇన్‌స్పెక్టర్లు సుధాకర్ రెడ్డి, నాగరాజునాయక్, అసిస్టెంట్ ఎంవీఐ బాబుకిషోర్, గణేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.